


# కదిలే నీడలు

## - బాలగంగాధర తిలక్

(ఆంధ్రపత్రిక – ఆదివారం సంచిక మే 7, 1944

నుంచి పునర్ముద్రితం)

'చీకటి' అన్నాడతను.

'అవును' అంది ఆమె.

ఇద్దరూ రోడ్డు మలుపు తిరిగారు. ఇప్పుడు వచ్చిన రోడ్డు మరీ పెద్దదిగా వుంది. ఈ వైపూ ఆ వైపూ మేడల వరుస ఆ నిశ్శబ్దంలోనూ, చీకటిలోనూ, ఆలోచన లేని మనస్సులలా బారులు తీర్చివున్నాయి. మధ్యమధ్య వలయంగా నీడలు కల్పిస్తూ, మెల్లకన్నులలా వున్నాయి. బ్లాకౌట్ చేయబడిన విద్యుద్దీపాలు. ఒక్కొక్కచోటా షెల్టర్లూ, సగం తీయబడిన గోతులూ, కంకరగుట్టలూ కూడా వున్నాయి.


ఆంధ్రపత్రిక • ఆదివారం, మే 7, 1944

కదిలే నీడలు

[కథ]

శ్రీ బాలగంగాధర తిలక్

యుద్ధంలో ఎవరిమట్టుకు వాళ్లు చెల్లాచెదరై పోయారు. కలకత్తాలో మేం యిద్దరమూ కలుసుకొన్నాము. ఎప్పుడూ విచారిస్తూ దగులుగా వుండేవాళ్లం. మా యిద్దరికీ యిష్టమయింది. కష్టాలన్నీ మరచిపోగలుగుతాం యిూ కొత్తనేపూ!'

'ఏంచేస్తూండేవారు మీ వారు?' అన్నాడతను.

'ఉద్యోగం చేసేవాణ్ణి ఓవర్‌సీర్‌గా.' అన్నాడు లెఫ్టినెంట్.

ఆమె అక్కణ్ణుంచి లేచి అల్లరిగా గాలిలో యెగిరే మిణుగురుల్ని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తూంది. ఆమె నిట్టూర్చింది. అతను జేబులోకి యిసుక తీసుకుని

'ఇలా ఎక్కడికి?' అంది ఆమె. తల పైకి ఎత్తినపుడు చెవిలోలకు మెరిసింది.

'ఎక్కడి కేమిటి?' అన్నాడతను. అతని చేయి జేబులోనికి పోయింది. కాని తిరిగి తీసివేశాడు.

'ఒక్కొక్కసారి చీకటి బాగానే వుంటుంది.'

'అవును' అంది ఆమె.

'మీకు యింగ్లీషు వచ్చునా?'

'ఆc!' అంది ఆమె.

'మీ ఆయన ఏం చదివాడు?' అన్నాడతను, మరొకవైపు చూస్తూ.

‘బి.యే.’

‘మిమ్మల్ని వదలి యెలా వెళ్ళాడు?’

‘లేకపోతే ఏం చెయ్యమంటారు?’

‘మీకు బాధగా లేదూ?’

‘ఎందుకు వుండాలీ?’ అంది ఆమె.

‘అంతే..అంతే..’ అన్నాడతను. దేనికోసమో, తిరిగీ అతని చెయ్యి జేబులోనికి పోనిచ్చి తిరిగీ తీసివేశాడు.

‘ఈరోడ్డు చాలా పొడుగు’ ఏం తోచక, యిలా అన్నాడు.

‘అవును.’

ఇంతలోకే మెరిసే టార్చితో ఒక కారు వచ్చి వాళ్ళ పక్కనుంచే పోయింది. ఆమె తప్పుకోవటంలో అతనికి తగిలింది. అతను తెలీకుండానే అప్రయత్నంగా ఆమెకు తగలబోయాడు. కాని ఆమె యింతలో దూరంగా తొలగింది.

‘ఏమిటిది?’ అని ఆమె కారుని ప్రశ్నిస్తూ అడిగింది.

‘లారీ __ మిలటరీ వాళ్ళది.’

‘యుద్ధం వస్తుందా?’

‘ఏమో’ అన్నాడతను.

ఒక మిణుగురు ఆమె ముంగురులకి తగిలి వెళ్ళిపోయింది. గేటు వెనకాల కుక్క వీళ్ళని చూసి మొరగబోయి మానివేసింది. ప్రక్కనే రోడ్డు మీద పడుకున్న ముసలిది కలవచ్చి కాబోలు కలవరించింది.

‘మీరేమిటీ ఆలోచిస్తున్నారు?’ అన్నాడతను.

‘ఏమీ లేదు’

‘ఏమీ లేదూ?’

‘ఏమీ లేదు.’ ఆమె స్ఫుటంగా అంది.

అతనికాశ్చర్యం వేసింది. ఏమీ లేకపోవటం అంటే? లారీలూ, షెల్టర్లూ, విమానాలూ, పత్రికలూ, హిట్లరూ, ఎ.ఆర్.పి, ఆమె, తానూ-అన్నీ అందరూ వుంటే ఏమీ లేకపోవటం యేమిటి? తెలివిగా తనంతట తనే కనురెప్పలమధ్య నవ్వుకొన్నాడు. ఒకసారి జేబులోనికి చెయ్యి పోనిచ్చి, తీసివేశాడు.

‘మీ ఆయన ఎక్కడున్నాడు?’

‘యీజిప్టులో.’

‘పాపం!’

‘ఏం?’ అంది ఆమె,

‘ఎందుకు సైన్యంలో చేరాడు?’

‘ఎందుకా .. మీరెందుకు చేరారూ?’

‘నేను యీదేశంలో వుంటానుగా.’

‘అయితే నేం?’

‘ఎందుకు చేరానా!’ అతను ఆలోచిస్తూ ట్రాము బద్దీలకేసి చూశాడు. అవి పొడుగ్గా సాగి ఎక్కడో చీకట్లో కలసిపోయాయి. ‘ఎందుకేమిటీ? యమ్మే ప్యాసయాను. ఉద్యోగమూ లేదు, డబ్బూ లేదు. నా భార్య కూడా చనిపోయింది. ఏం తోచలేదు. అందుకే సైన్యంలో చేరాను.’ ఏదో ఆలోచిస్తూ అలాగే ఆతను నుంచునిపోయాడు.

ఆమె నాలుగడుగులు ముందుకు వేసి, వెనక్కి తిరిగి ‘ఆగిపోయారేం?’ అంది.

'మర్చిపొయ్యాను.' అని క్రాఫు సవరించుకొని బయల్దేరాడు.

'మీ భార్య ఎందుకు పోయిందీ?' ఆమె అడిగింది.

'నన్ను ప్రేమించీ'

ఆమె వింతగా చూసింది. అతను కంగారుగా తల తిప్పుకున్నాడు.

'ఎప్పుడయింది మీ పెళ్ళి?' అంది ఆమె.

'మేం పెళ్ళి చేసుకోలేదు.' అన్నాడతను.

'అంటే?'

'ఆమె చదువుకుంటూ నాతో వచ్చేసింది. నాగపూరు వెళ్ళిపోయాం. అక్కడ సత్యాగ్రహంలో పాల్గొన్నాము. మమ్మల్ని జైలులో పెట్టారు.'

'తర్వాత?'

'జైలులో మలేరియా వచ్చింది ఇద్దరికీ. మమ్మల్ని వదిలి పెట్టారు. నాకు మలేరియా దానంతటదే కుదిరింది. ఆమెకు కుదరలేదు మందులేక.'

'మందు ఎందుకు లేదు?'

'డబ్బు లేక ' అతను గుండెమీద చెయ్యి పెట్టి రాచుకొన్నాడు. ఆమె అవ్యక్తంగా వచ్చే ఒక ఆలోచనని తల్చుకుని భయపడి 'అబ్బా!' అంది.

'ఏం?' అన్నాడతను.

'ఏమీ లేదు.' అంది ఆమె

అతనికి తిరిగీ ఆశ్చర్యం వేసింది. తెలీని బాధా, ఒొంటరితనమూ, యుద్ధమూ, యీజిప్టూ, మలేరియా– ఇన్ని వుంటే లేకపోవటం ఏమిటి?

ఆకాశం మీద ఆర్ద్రా నక్షత్రం మీద ఒక లేత మబ్బు కప్పుకొని వుంది. ప్రక్క సందులో ఒక ఆంగ్లో యిండియన్ యువతీ యువకుడూ బూట్సులు చప్పుడు చేసుకుంటూ వెళ్ళుతున్నారు.

'మీరు వేల్సు ' Things to come' చదివారా?'

'నాకు వేల్సు అంటే అయిష్టం.'

'అందులో Walking dicease వచ్చిందిట యుద్ధం మూలాన్ని. మనకీ ఆ జబ్బు వచ్చిందేమో?' అతను నవ్వుదామని ప్రయత్నించి దానికి బదులుగా దగ్గాడు.

'మా మేనమామ క్షయమూలాన్ని చనిపోయాడు.' అంది ఆమె.

'మంచి పని చేశాడు.' అన్నాడతను. తిరిగీ యిలా అన్నాడు.

'మీరెందుకు నర్సుగా చేరారు?'

'ఆయన యుద్ధంలోకి వెళ్ళారా, మరి నేనేం చెయ్యను? ట్యూషన్లు చెప్పమన్నారు'

'బాగానే వుంది.'

'కాని చెప్పలేదు.'

'ఏం?'

'నాకసహ్యం.'

'తర్వాత?'

'నర్సుగా చేరాను ఒక హాస్పిటల్లో.'

'మరి.'

'ఒక రోగి వచ్చాడు.'

'ఎవరూ?'

'ఒకరూ, అతనంటే యిష్టం కలిగింది.'

'అంటే?'

'బాధపడుతూన్న అతనికీ బాధపడే రోజులున్నాయని తెలిసిన నాకూ ఒక వాత్సల్యం ఏర్పడింది.'

'మీకు తెలుగు బాగా వచ్చునే!'

'అవును పరీక్షల్లో పోయేది ఎప్పుడూ.'

'నర్సుపని ఎందుకు మానేశారు?'

'ఆ రోగి పోయాడు. తిరిగీ ఆ హాస్పిటలులో వుండలేకపోయాను.'

'మరి ఎందుకు సైన్యానికి నర్సుగా చేరారూ?'

'కొన్నాళ్ళు యీజిప్టు దగ్గర నుంచి ఉత్తరాలు వచ్చాయి. ఆ తర్వాత రాలేదు. '

'ఆహాఁ!'

'తర్వాత అతని భుజంలోంచి గుండు దూసుకు పోయిందని వార్తవచ్చింది.'

'పాపం!' అతను అప్రయత్నంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

'బ్రతికి వున్నాడో లేదో తెలియదు.'

ఆమె నుదుటి మీద పడే ముంగురుల్ని వణికే చేతితో సవరించుకుంది. 'అప్పటినుంచీ సంక్షోభంగా వుండేది మనస్సు. నేనూ కలకత్తా వచ్చి యీ సైన్యదళాలకి నర్సుగా చేరాను.'

'ఇక్కడ శాంతిగా వుందా?'

'లోని కంగారుని అణచివేస్తోంది ఈ యుద్ధ సంక్షోభం. ఒక్కొక్కసారి యీ సోల్జర్లలోనూ ఆయన ఉన్నాడా అనిపిస్తుంది.' అతనికేమనాలో తోచలేదు. 'చీకటి బావుంటుంది.' అన్నాడు. జేబులో చెయ్యిపెట్టి తీసివేశాడు. ఇద్దరూ రోడ్డు చివరకి వచ్చారు. దూరంగా పెద్ద మైదానంలో చిరుకాంతిలో డేరాలు కనపడ్డాయి. ఒక సన్నని గొంతుక పాడుతూన్నట్టు వినబడుతోంది. మైదానంలో యిక్కడా అక్కడా ఒకరిద్దరు కూర్చున్నారు.

'ఏమిటిదీ?' అంది ఆమె.

'బర్మా నుంచి వచ్చిన వాళ్ళ క్యాంపు.'

'వెళుదామా?'

'ఊఁ!'

ఇద్దరూ ఆ డేరాల వైపు నడవసాగారు. అంత రాత్రివేళ కొందరు డేరాలకి దూరంగా కూర్చుని ఉన్నారు. కొన్ని చోట్ల ఒక స్త్రీ పురుషుడూన్నూ. మెల్లగా వీచే గాలిలో వాళ్ళ గుసగుసలు వినబడుతున్నాయి డేరా సందులలోంచి వెలుగు సన్నగా పాకి యిసుక మీద పడి మెరుస్తోంది.

'వీళ్ళు భార్యా భర్తలా!' అంది ఆమె.

'అవచ్చును. ఏం చెప్పగలం?' అన్నాడతను.

డేరాలు సమీపించారు. కొందరు పోలీసులు కనులు సగం తెరచి నిద్రపోతున్నారు. డేరాలకు కొలది దూరంలో షెల్టర్లు వున్నాయి. డేరాలలో పెట్టెలూ, సామానులూ, పేర్చబడి వున్నాయి. క్రింద చాపలమీద అనేకులు వృద్ధులూ, స్త్రీలూ, బాలురూ పడుకొని వున్నారు.

'ఎంతమందో!' అంది ఆమె.

'ప్రతి పట్టణంలోనూ వున్నారు.' అన్నాడతను.

ఒక చంటిపిల్ల 'కేరు' మంది. ఏడుస్తూ ప్రక్కకి దొర్లి మరొకరి వొళ్ళోకి వెళ్ళింది అతను విసుక్కుంటూ ఆ పిల్లని తోసివేశాడు. ఆ పిల్ల గట్టిగా ఏడవటం మొదలు పెట్టింది. ఇంతలోకే ఒక వృద్ధుడు లేచి, ఆ పిల్లను ఎత్తుకొని, ఓదారుస్తున్నాడు. ఆమె అడిగింది. 'తల్లి లేదూ?' ఆ వృద్ధుడికి అర్థమవలేదు తిరిగీ ఆమె యింగ్లీషులో అడిగింది. ఆ వృద్ధుడు అతి కష్టం మీద మాటలు పోగు చేసుకుంటూ యిలా చెప్పాడు. ఆపిల్ల తన కూతురు కూతురనీ, తన

కూతురు అస్సాము సరిహద్దు దగ్గర ప్రసవించి చనిపోయిందనీన్ని! తిరిగీ ఆగి యిలా అన్నాడు 'దీనికి పాలు లేవు. ఏం చెయ్యను! ఇది చచ్చిపోయినా బావుండును.'

ఆమె జాలిగా చూసింది. ఇద్దరూ తిరిగీ డేరాలు దాటి బయలుదేరారు.

'నాకు జాలివేసింది.' అంది ఆమె.

'ఏం' అన్నాడతను.

'ఆ పిల్ల నెత్తుకోవాలనిపించింది. కాని అసహ్యంగా వుంది, ఎముకలూ నాడులూ పైకి వచ్చి' ఆమె వెనక్కి తిరిగి చూసింది.

ఆమెకి యామయ్యాడో తెలియని భర్త యీజిప్టులో యిలాగే యిసుకలో సైనిక సమూహంతో నడుస్తున్నాడు గదా అని భావించుకుంది. ఒకసారి పమిట చేత్తో సవరించుకుంది. ఎదురుగా ఒక యిరవై ఏళ్ళ యువకుడూ, యిరవై నాలుగేళ్ళ యువతీ వస్తున్నారు ; మసక నిదురలో నడుస్తూన్నట్లు. ఆ యువతి వీళ్ళని నిదానించి చూసి 'భామా' అని ఒక్క పరుగున వచ్చి వీళ్ళని చూసి, హఠాత్తుగా ఆగి, పకపకా నవ్వటం ప్రారంభించింది.

ఆ యువకుడు బర్మావాళ్ళ ఏదో భాషలో ఏదో అన్నాడు.

'ఎందుకు నవ్వుతావు?' అన్నాడు యింగ్లీషులో అతను.

'మిమ్మల్ని 'భామా' అనుకుంది. కాని మీరు 'కారు' అన్నాడు ఆ యువకుడు. ఆ యువతి ఏదో అంది. ఆమె నిద్రలేని కళ్ళు బరువుగా నవ్వాయి.

'ఆమె ఎవరని. ఈమె అడుగుతోంది.' అన్నాడాయువకుడు తనతో ఉన్న స్త్రీని చూపి.

'ఎవరేమిటీ ఎవరూ కాదు.' అన్నాడతను. ఆగి 'నీ పేరు?' అన్నాడు.

'లిన్ టంగ్.' అన్నాడు యువకుడు.

'ఈ రాత్రి యిలా ఎందుకు వచ్చారు. మీరు క్యాంపులో వుంటారా?'

'కాదు. మా దేశం యిది. మిలిటరీలో పని చేస్తున్నాం.' అన్నాడతను.

ఆ మాటలు ఆ భాషలోకి అనువదించి యువతితో చెప్పాడు లీన్ టంగ్.

'ఈమె పేరు అమా' అని తనతో ఉన్న స్త్రీని పరిచయం చేశాడు.

అమా వాళ్ళ భాషలో అంది. 'ఈ రాత్రి వీళ్ళెందుకు తిరుగుతున్నారు మనలాగా ?'

లీన్ టంగ్ చిరునవ్వుని లావుపాటి పెదవుల మధ్య నొక్కిపెట్టి 'కూర్చుందామా' అన్నాడు. కొద్దిగా ప్రక్కకి వెళ్ళి నలుగురూ కూర్చున్నారు. ఆ యువతి ఏదో మాట్లాడుతూ పకాలున నవ్వుతూంది. అతను అన్నాడు. 'ఆమె మీ అక్కయ్యా యేమిటి' లీన్ టంగ్ పళ్ళికిలించి 'కాదు కాదు. నాకన్న అమా నాలుగేళ్ళు పెద్ద అయినా యిప్పుడు భార్యలాంటిది.'

అతను అప్రయత్నంగా ఆమెకేసి చూశాడు. ఆమె లీన్ టంగ్ వైపు చూసింది. అతను జేబులో చెయ్యి పెట్టి తీసివేశాడు. ఆమె అడిగింది. 'మీరు' 'అమాని వివాహమాడలేదూ.'

'ఊహూఁ!; అది కాదన్నట్టుగా తలవూపాడు లీన్ టంగ్. 'ఈమె నా స్నేహితుని భార్య. ఒక పిల్లవాడు కూడా వుండేవాడు. యుద్ధంలో ఎవరిమట్టుకు వాళ్ళు చెల్లాచెదరై పోయారు. కలకత్తాలో మేం యిద్దరమూ కలుసుకొన్నాము. ఎప్పుడూ విచారిస్తూ దిగులుగా వుండేవాళ్ళం. మా యిద్దరికీ యిష్టమయింది. కష్టాలన్నీ మరచిపోగలుగుతాం యీ కాస్తసేపూ!'

'ఏం చేస్తూ ఉంటారు మీరు?' అన్నాడతను.

'ఉద్యోగం చేసేవాణ్ణి పోవర్ శీర్ గా.' అన్నాడు లీన్ టంగ్.

అమా అక్కణ్ణుంచి లేచి అల్లరిగా గాలిలో యెగిరే మిణుగురుల్ని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తూంది. ఆమె నిట్టూర్చింది. అతను చేతిలోకి యిసుక తీసుకుని కొద్ది కొద్దిగా కింద పోస్తూ యిలా అన్నాడు. 'నువ్వు అమా కంటే చిన్నవాడివి.'

'అవచ్చును.' అన్నాడు లీన్ టంగ్ క్రాపు లోనికి చతులు పోనిచ్చి. అతను ఆమెకేసి చూశాడు. ఆమె కునుకు పాట్లు పడుతూంది. అతను వీపుమీద తట్టి ఆమెను లేపాడు. ఆమె కళ్ళు తెరచి, చనువుగా నవ్వి 'నిద్ర వచ్చింది-చిత్రంగా!' అంది.

'ఏదేనా ఉద్యోగం చేయరాదు?' అన్నాడతను లిన్ టంగ్ తో.

'అదే ఆలోచిస్తున్నాను. నేనూ మిలటరీలో చేరుదామనుకుంటున్నాను.' అన్నాడు లిన్ టంగు.

'మరి అమా?' అంది ఆమె.

లీన్ టంగ్ ప్రేమగా అమా వైపు చూశాడు. 'అవును, యేడుస్తుంది, అయితేనేం, యీ దేరాలలో సరీగ్గా తిండి లేకుండా ఎన్నాళ్ళు వుండగలం? నేను లేకపోతే యింకొక మంచి వాణ్ణి స్నేహం చేసుకుంటుంది. యుద్ధం వచ్చాక ఏం చేస్తాము. ఒకరిమీద ఒకరు ఆధార పడకపోతే బ్రతకటమే కష్టమవుతుంది. ఎప్పుడేమయిందీ తెలియదు. అందుకనే కష్టాలన్నీ మరచిపోయే స్నేహం కావాలి.' లీన్ టంగ్ గొంతుకలో కందిరీగ దూరినట్లు స్వరం విషాదంగా పలికింది 'ఏదీ నా అమా? అల్లరి పిల్ల' దూరంగా వెళ్ళిపోయింది. నేనూ వెళ్తాను' అంటూ లీన్ టంగ్ లేచాడు. అతను లేచాడు. ఆమె లేచింది.

నిశ్శబ్దంగా యిద్దరూ ముందుకు నడిచి వెళుతున్నారు. పోలీసు యీల దూరంగా వినబడింది. తూర్పున నక్షత్రం మీద కప్పుకున్న మబ్బు పింజెలు పింజెలుగా విడిపోయింది. ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు, దూరంగా అమా లిన్ టంగ్ కౌగిళ్ళలో వున్నారు. ఇద్దరూ యిసుక ప్రదేశం దాటి, ఎత్తుగా వున్న ఒక దిబ్బవద్దకు వచ్చారు. కొన్ని తాడిచెట్లు యిక్కడా అక్కడా వున్నాయి.

'ఇలా కూర్చుందాం.' అతను అన్నాడు.

'ఊఁ!' అంది ఆమె.

ఆ దిబ్బమీద యిద్దరూ కూర్చున్నారు. ఆకాశం మీద చంద్రుడు వదలిన పువ్వురేకులా వున్నాడు. ఇద్దరి నీడలూ వెనక్కి పొడుగ్గా సాచుకొని వున్నాయి.

'లిన్ టంగ్ చిత్రమైనవాడు.'

'ఔను!'

'అవును' అంది ఆమె.

'మరీ...'

'ఏమిటి?' అందామె.

'ఏదో చెప్పబోయి మరిచిపోయాను?' అన్నాడతను. జేబులోనికి చెయ్యి పోనిచ్చి తిరిగీ తీసివేశాడు.

ఆమె వింతగా చూసింది అతనికేసి. అతను నిశ్చలంగా శూన్యంకేసి చూస్తున్నాడు తాటి చెట్టుపక్కనుంచి ఒక ముంగిస పరుగెత్తుకు వెళ్ళింది. గుడ్డి వెన్నెలలో పట్టణపు మేడల కొసలు మెరుస్తున్నాయి. దూరంగా దేరాల నీడలు యిసుకలో మెత్తగా పరచుకుంది. గాలి కదులో నిశ్శబ్దం కదులుతూంది. అతను నవ్వాడు. ఆమె ముంగురులు సవరించుకుంటూ 'ఏం' అంది.

'ఏముందీ, ఎందుకొవచ్చింది, ఏడుపులాంటి నవ్వు.' అన్నాడాతను చెయ్యి జేబులోనికి పోనిచ్చి తిరిగీ తీసివేశాడు. గంభీరంగా మారిపోయాడు. పళ్ళు పటపట కొరుకుతూ 'యుద్ధం, యుద్ధం' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అతను ఆమెకేసి చూశాడు. ఆమె కళ్ళమ్మట నీటి చుక్కలు రాలుతున్నాయి. అతను తెల్లబోయాడు. జాలి అతని మొహంలో ప్రసరించింది. 'ఎందుకు, ఎందుకు ఏడుస్తున్నావూ?' అన్నాడు. ఆమె జవాబు యివ్వలేదు. అతను ఆమె దగ్గరగా జరిగి ఆమె తలనీ, చెక్కిళ్ళనీ నిమిరాడు. ఆమె వొరిగి, అతని వక్షం మీద శిరస్సుని ఆన్చింది. అతను ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాడు. ఇద్దరూ ఒకరి ప్రక్కగా ఒకరు ఒరిగి పడుకున్నారు.

'రేపు ఆఫీసరు వస్తాడు పరీక్షచేసేందుకు.'

'అవును' అంది ఆమె.

'ఇక్కడ బావుంది కదూ, పీడకలలు వచ్చే నిద్రకన్న' అన్నాడతను. అతను తిరిగీ చెయ్యి జేబులోనికి పోనిచ్చి తిసివేశాడు.

'ఎందుకూ యిందాకటి నుంచీ జేబు తడుము కుంటున్నారూ!' అంది ఆమె. ఆతని జుట్టులోనికి వేళ్ళని పోనిస్తూ.

అతను నవ్వాడు. 'సిగరెట్ల కోసం. లేవన్న మాట మరిచిపోతూంటాను!'

మధ్య మధ్య ఏవో చప్పుళ్ళకి తప్ప ఆ పట్టణం అంతా నిశ్శబ్దంలో ముడుచుకుని వుంది. ఆ గుడ్డి వెన్నెలలో ఆ నగరమూ, జనమూ పెద్ద నీడలులా పరచుకొని వున్నాయి.

★★★

COMMENTS